


అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ వెంకటేశ్వరి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

18 ఏళ్లు దాటిన విద్యార్థులంతా చైతన్యంగా ఓటు నమోదుకు ముందుకు రావాలని తహశీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి సూచించారు. గొల్లవిల్లి ఎంఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఓటు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు.విద్యార్థులంతా 18 ఏళ్లు నిండగానే ఓటు నమోదు చేసుకుని ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని అవగాహన కల్పించారు. విద్యార్థులు ఓటు అర్హత సాధించి ఆ హక్కును ఓ ఆయుధంలా ఉపయోగించుకోవాలని సూచించారు. ఓటు ఎలా నమోదు చేసుకోవాలి ఏ ఫారం పూర్తి చేయాలి వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

సెక్టార్ అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-అమలాపురం

2024 సాధారణ ఎన్నికలకు సంబంధించి సెక్టార్ అధికారులుగా నియమితులైన వారికి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం అమలాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గోదావరి భవన్ లో నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ 2024 లో జరిగే సాధారణ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పని చేయాలనిఆదేశించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి వివిధ శాఖల నుండి 143 మంది అధికారులను, పోలీస్ శాఖ నుండి 143 మంది పోలీస్ అధికారులను సెక్టర్ అధికారులుగా నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల సంఘం సూచించిన విధంగా సెక్టార్ అధికారులకు శిక్షణ ఇవ్వడం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శుక్లా

జరిగిందని కలెక్టర్ తెలిపారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి ఖాదర్ బాషా, డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల రిటర్నింగ్



పాల్గొన్న అధికారులు

ఆఫీసర్లు జి.కేశవరెడ్డి, యం.ముక్కంటి, సుధాసాగర్, వి.శివ శంకర్ ప్రసాద్, రమణారెడ్డి, సెక్టార్ అధికారులుగా నీయమితులైన అధికారులు పాల్గొన్నారు.

రూ.2కోట్లతో పార్కుల అభివృద్ధి

మంత్రి వేణుగోపాలకృష్ణ

ప్రజాశక్తి- రామచంద్రపురం

రామచంద్రపురం పురపాలక సంఘం సమావేశం ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ పట్టణంలో రూ.2కోట్లతో పార్కులు అభివృద్ధి చేస్తున్నామని వీటికి సంబంధించిన నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. పట్టణంలో మురికి కాలువల ద్వారా వచ్చే మురుగునీటిని శుద్ధి చేసే విధంగా సీనరేజీ ప్లాంటును ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనికోసం ఇప్పటికే రూ.12 కోట్లు విడుదల అయ్యాయని వివరించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ పట్టణంలోనీ పలు



సమావేశంలో పాల్గొన్న మంత్రి వేణు, ఛైర్‌పర్సన్ శ్రీదేవి

సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చర్యలు

ప్రజాశక్తి- అమలాపురం

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా హెచ్చరించారు. గురువారంకలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో లింగ నిర్ధారణ పరీక్షల నిషేధిత చట్టం, సహాయ పునరుత్పత్తి సాంకేతిక చట్టం, సరోగసి చట్టం ల మీద జిల్లా మరియు ఉప జిల్లా స్థాయి అప్రా ప్రేయట్ అథారిటీలకు, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు నడిపే వ్యక్తులకు, జిల్లాలోని ఇతర డాక్టర్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదటగా కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశానికి హాజరైనవారికి ఆయా చట్టాల గురించి అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ.. శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. జన్యు క్లినిక్లు, సంతాన సాఫల్య కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు (లాబ్స్) పిసిపిఎన్‌డిటి చట్టం కింద రిజిస్టరై ఉండాలన్నారు. క్లినిక్ లు, హాస్పిటల్లు, స్కానింగ్ కేంద్రాలు స్కానింగ్ యంత్రాలను కొనుగోలు చేసే ముందుగానే జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ దగ్గర ఎన్‌ఓసి తీసుకోవాలన్నారు. జిల్లాలో డెలివరీలు సిజేరియన్ ద్వారా ఎక్కువ అవుతున్నాయని, వీలైనంతవరకు సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలని డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి జి.కేశవ వర్ధన్ రెడ్డి, రామచంద్రాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి సుధా సాగర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి దుర్గారావు దొర, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ వి.శివశంకర ప్రసాద్, అమలాపురం డిఎస్‌పి అంబికా ప్రసాద్, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ డాక్టర్ పియస్.శర్మ, ఎన్‌జిఒ సభ్యులు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా స్వశక్తి భవనాన్ని ప్రారంభించాలి

ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి-మండపేట

స్థానిక 20వ వార్డు గొల్లపుంత కాలనీలో నిర్మించిన మహిళా స్వశక్తి భవనాన్ని వెంటనే ప్రారంభించాలని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యులు ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అజెండాలోని 17వ అంశం మహిళా స్వశక్తి భవనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం ఆమోదం కౌన్సిల్ లో చర్చకు వచ్చినపుడు ఎంఎల్ఎ వేగుళ్ళ మాట్లాడుతూ సౌకర్యాలతో డ్వాక్రా సంఘ సభ్యుల నగదు మహిళా స్వశక్తి భవనాన్ని పూర్తిచేస్తామని అయితే నాలుగు సంవత్సరాలు పూర్తయిన నేటికీ భవనాన్ని ప్రారంభించలేదన్నారు. డిసెంబర్ నెలలో భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.



సాధారణకౌన్సిల్ సమావేశంలోమాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల

పనులు పూర్తిచేశాకే భవనం ప్రారంభం: ఎంఎల్‌సి తోట

అనంతరం ఎంఎల్‌సి తోట మాట్లాడుతూ భవన ప్రారంభానికి తమ ప్రభుత్వం వ్యతిరేకం కాదని అన్ని పనులు పూర్తిచేసేకే భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. స్థానిక 13వ వార్డులో నిర్మాణ పూర్తికాకుండానే భవనాలు ప్రారంభించారన్నారు. అంబేద్కర్, జ్యోతిరావుపూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను పట్టణంలోని ముఖ్య జంక్షన్లో ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు ఆదర్శంగా నిలుస్తామన్నారు. ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలపడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తొలుత మాజీ కౌన్సిలర్ డాక్టర్ పాలడుగు సత్యవతి మతికి కౌన్సిల్ సభ్యులు సంతాపం తెలిపారు. సమావేశంలో కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు 'పులసను సంరక్షించు కుందాం' ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సంచలనం సృష్టించిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమల కుమారి గురువారం తెలిపారు. విజయవాడలోని కెఎల్ యూనివర్సిటీ నందు జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ నందు రాష్ట్రవ్యాప్తంగా 1084 ప్రాజెక్టులను ప్రదర్శించారని ఆమె తెలిపారు. వాటి నుంచి మొదటి 17 స్థానాలు గెలిచిన ప్రాజెక్టులు జాతీయస్థాయి సైన్స్ కాంగ్రెస్ కి ఎంపికయ్యాయని తెలిపారు. సమనస నందు గల ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి చైతన్య దీపిక, గైడ్ టీచర్ సుభాషిని ఆధ్వర్యంలో నిర్వహించిన మన కోనసీమ సంపద పులసను సంరక్షించు కుందాం అనే ప్రాజెక్టు జాతాయ స్థాయికి ఎంపికైందని ఆమె తెలిపారు. చైతన్య దీపికకు ఎస్‌సిఇఆర్టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి, మెంబర్ సెక్రటరీ ఆఫ్ కాస్ట్ అపర్ణ, రాష్ట్ర సైన్స్ సిటీ కోఆర్డినేటర్ జయరాం రెడ్డి, కెఎల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జగన్నాథరావు చేతుల మీదగా నగదు పురస్కారం ట్రోఫీ అంద జేశారన్నారు. ఈ విద్యార్థిని త్వరలో జరగబోయే జాతీయస్థాయి సైన్స్ కాంగ్రెస్ దినోత్సవం లో పాల్గొనవలసి ఉంటుందని వాటికి సంబంధించిన వివరాలు త్వరలో వెల్లడిస్తామని జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం తెలియజేశారు. జాతీయస్థాయి ఎంపికైన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయ బందాన్ని మరియు విద్యార్థిన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమల కుమారి, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం, జిల్లా ఎకాడమిక్ కోఆర్డినేటర్ బ్రహ్మానందం, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఫణిబాల లక్ష్మీనరసింహ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సురేష్, బి.రమణశ్రీ అభినందించారు.



రాష్ట్రస్థాయి సైన్స్‌కాంగ్రెస్ ప్రదర్శనలో అవార్డు గ్రహీతలు 'కోనసీమ బృందం'



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రతి ఒక్కరికీ భారత రాజ్యాంగం సమాన అవకాశాలు కల్పించిందని, వాటిని అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ భారతదేశ దళిత అకాడమీ అధ్యక్షుడు పోనుగుమట్ల విష్ణుమూర్తి అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, యువ భారత ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వకత్వ మరియు వ్యాస రచన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం గురువారం స్థానిక ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఆడిటోరియం హాలు నందు టి నాగరాజారావు అధ్యక్షతన నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్‌లు, మరియు షీల్డ్‌లు అందజేశారు. విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారత రాజ్యాంగం అత్యున్నతమైనదన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రాథమిక విధులు, హక్కులను పొందుపరచడంతో పాటు మహిళలకు ప్రత్యేక హక్కులను కల్పించడం జరిగిందన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ కెఎస్. నారాయణ రాజ్యాంగ విశిష్టతను కొనియాడారు కార్యక్రమంలో పుల్లేపు తాతయ్య మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు డా.పుల్లేపు వెంకటేశ్వరరావు, పీపుల్స్ ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షుడు కన్నిడి వెంకటేశ్వరరావు, యువ భారత్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



చివరికి మనం.. అడ్రస్ లేకుండా పోతామేమో సార్..!!!

నష్టాల్లో వ్యవసాయ రంగం

- ప్రభుత్వ చేతగాని తనమే కారణం
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్
- కాకినాడ జిల్లాలో ప్రవేశించిన యువగళం

ప్రజాశక్తి - తాళ్లరేవు, ముమ్మిడివరం

రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి చేతగాని పాలన కారణంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం నష్టాల ఊబిలో కూరుకుపోతుంది టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. 213వ రోజు యువగళం పాదయాత్ర గురువారం సుంకరపాలెం క్యాంపు సైటు నుంచి ప్రారంభమైంది. లోకేష్‌ను పటవల గ్రామ రైతులు ఈ సందర్భంగా కలిశారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. నాలుగున్నరేళ్లుగా వ్యవసాయ పంటలకు మద్దతు ధర లభించట్లేదని ఆయన వద్ద వాపోయారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడారు. రైతుల ఆత్మహత్యల్లో దేశంలో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానం, కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటల బీమా పథకాలను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. అధికారంలోకి వస్తే రైతులందర్నీ ఆదుకుంటామన్నారు. అన్నదాత పథకం కింద ప్రతి రైతుకూ ఏటా రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. మధ్యాహ్నం కోరంగిలో శెట్టిబలిజ సామాజికవర్గం ప్రతినిధులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. లచ్చిపాలెం గ్రామస్తులు కలిసి సమస్యలను ఏకరువు పెట్టారు. ఇంజరం రోడ్డులో వంతెన తూరల్లో చెత్త పేరుకుపోవడం వల్ల సాగునీరు అందక 13 గ్రామాలు రైతులు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. దీనిపై జగన్ స్పందించారు. జగన్ అండ్ కోకు అడ్డగోలు దోపిడీపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదన్నారు. కనీసం కాలువల పూడిక కూడా తీయలేని స్థితిలో ప్రభుత్వం ఉండటం శోచనీయమన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఇంజరం వంతెన నిర్మాణంతో పాటు శాశ్వత ప్రాతిపదికన తూరలు ఏర్పాటుచేస్తామన్నారు. అనంతరం బాపనాపల్లి గ్రామస్తులు ఆయన్ని కలిశారు. రహదారులు ఛిద్రంగా మారాయన్నారు. కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా ఉన్నాయని ఆయనకు తెలిపారు. ఇళ్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో పునాదుల్లోనే ఆగిపోయాయని తెలిపారు. లోకేష్ మాట్లాడుతూ గుంతల్లో రోడ్లు వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పి.మల్లవరం గ్రామస్తులు లోకేష్‌కు సమస్యలపై వినతిపత్రం అందించారు. జిఎస్‌పిసి హామీలు అమలు చేయట్లేదన్నారు. గ్రామంలో గ్రంథాలయం, 50పడకల ఆసుపత్రిని నిర్మించాలని, అంబులెన్సు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఒఎన్‌జిసి రూ.50వేలు సాయం అందించేలా చూడాలన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఒఎన్‌జిసితో చర్చించి హామీల అమలుకు చర్యలు తీసుకుంటామని లోకేష్ వారికి తెలిపారు. పలువురు నిరుద్యోగులు ఆయన వద్ద సమస్యలు ఏకరువు పెట్టారు. రియలయన్స్, జిఎస్‌పిసి, ఒఎన్‌జిసి కంపెనీలు ఉన్నా ఇక్కడ నిరుద్యోగులకు అవకాశం కల్పించట్లేదన్నారు. లోకేష్ స్పందిస్తూ... జగన్‌కు కమీషన్లపై ఉన్న శ్రద్ధ పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనపై లేదన్నారు. చంద్రబాబు తెచ్చిన కంపెనీలను జే ట్యాక్స్ కోసం వేధించి తరిమేశాడన్నారు. లక్షలాది ఉద్యోగాలు కల్పించే ఫ్యాక్స్ కాన్, లులూ, అమర్ రాజా, జాకీ వంటి పరిశ్రమలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయన్నారు. తాము అధికారంలోకొస్తే తాళ్లరేవులోని కంపెనీలతో మాట్లాడి ఉద్యోలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిరుద్యోగులకు రూ.3వేల భృతి అందిస్తామన్నారు. ప్రతి ఏటా జాబ్ నోటిఫికేషన్ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. అలాగే ఇసుక నావ కార్మికులు, భవన నిర్మాణ రంగ కార్మికులు, వడ్రంగి మేస్రీలు, ఇతర చేతివృత్తుల వారి సమస్యలను ఆయన విన్నారు. తాళ్లరేవులో ఫిష్ ఆంధ్ర పేరుతో ఏర్పాటు చేసిన సర్కారు వారి చేపలు దుకాణాన్ని పరిశీలించారు. డిగ్రీలు, పీజీలు చేసిన వారిలో జగన్ చేపల దుకాణాలు, మటన్ మార్టులు పెట్టిస్తున్నాడని విమర్శించారు.



దళితుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న లోకేష్

తాళ్లరేవులో ఘన స్వాగతం

తాళ్లరేవులో నారా లోకేష్‌కు ఘన స్వాగతం లభించింది. రవి జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులతో కలిసి ఆయన కొంత దూరం పాదయాత్ర చేశారు. జార్జి పేట వై.జంక్షన్, పి.మల్లవరం జంక్షన్, జైభీమ్‌పేట వద్ద నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. హారతులు పట్టారు. ఆయన వెంట టిడిపి అమలాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి గంటి హరీష్ మాథూర్, మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, జనసేన నాయకులు పితాని బాలకృష్ణ, కందుల దుర్గేష్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎంఎల్ఎ బుచ్చయ్య చౌదరి తదితరులున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ

రెండవ రోజుకు కాంప్లెక్స్ నిర్వహణ

ప్రజాశక్తి-మండపేట

పట్టణ పరిధిలో గౌతమి మున్సిపల్ స్కూల్, మండలంలోని ద్వారపూడి గ్రామంలో బాలుర ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ స్థాయిల్లో కాంప్లెక్స్ నిర్వహణ కార్యక్రమం గురువారం నాటికి రెండవ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం తెలుగు, హిందీ, గణితం, బయోలాజికల్ సైన్స్, సబ్జెక్టులలో కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.వెంకట సోమిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో మూడు మండలాల ఉపాధ్యాయులు హాజరయ్యారు.



పాదులు తొలగించిన విద్యుత్ స్తంభం

విద్యుత్ స్తంభంపై తొలగించిన పాదులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన


ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఏడిద స్థావరం శివారు కాలనీలో విద్యుత్ స్తంభానికి అలుముకున్న తీగ జాతి మొక్కలు, పాదులను విద్యుత్ సిబ్బంది తొలగించారు. అల్లికతో అపాయం, విద్యుత్ వైర్లకు పాదుల తీగలకు తాకితే వాటి ద్వారా విద్యుత్ ప్రవాహం రావచ్చనని ఇటీవల 'ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి, జనసేనలు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను ముమ్మిడివరంలో రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్, టిడిపి ఇంఛార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం లు గురువారం కలిశారు. ఈ సందర్భంగా లోకేష్ రామచంద్రపురం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. జనసేన పార్టీ, టిడిపిలు రెండు సమిష్టిగా కలిసి పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని కార్యక్రమాన్ని సమన్వయంతో రూపొందించుకుని ముందుకు వెళుతున్నామని వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి విజయం సాధిస్తాయని వారు లోకేష్‌కు వివరించారు. దీంతో లోకేష్ నియోజకవర్గం లో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ వచ్చే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



నారా లోకేష్‌ను కలిసిన టిడిపి, జనసేన పార్టీ ఇన్‌ఛార్జిలు

భూహక్కు చట్టంతో పేదలకు మేలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

జగనన్న శాశ్వత భూహక్కు చట్టం పేదలకు లబ్ధిచేకూరుతుందని ప్రభుత్వ విప్ మరియు స్థానిక ఎంఎల్ఎ చిర్ల జగ్గరెడ్డి అన్నారు. ఆయన మండలంలోని ర్యాలి లంక భూముల్లో ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన 257 మంది రైతులకు గురువారం శాశ్వత భూహక్కు చట్టం పట్టాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ గతంలో డి క్లాస్, ఏక్ సాల్ లీజు పట్టాలు ఉండి రైతులకు వారి భూమిపై శాశ్వత హక్కు ఉండేది కాదని, నేడు జగనన్న ప్రభుత్వంలో రైతులు అందరికీ మేలు జరిగేలా వివిధ పంట భూముల సమస్యలు పరిష్కరించి వారికి శాశ్వతంగా పట్టాలు పంపిణీ చేస్తున్నారని, అందులో భాగంగా ర్యాలి గ్రామంలో 257 మంది రైతులకు 20 సెంట్ల నుండి 50 సెంట్ల వరకు శాశ్వతంగా వారికే హక్కు ఉండేలా చర్యలు చేపట్టారని అన్నారు. సిఎం జగన్ పేదలకు చేయాలనుకున్న మంచిని ఎలాగైనా చేసి తీరుతారని దానికి ఈరోజు పట్టాల పంపిణీనే నిదర్శనమని ఎంఎల్ఎ జగ్గిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కా ఛైర్మన్ కప్పల శ్రీధర్, కొత్తపేట ఆర్‌డిఒ ముక్కంటి, తహశీల్దార్ డివిఎస్ అనిల్ కుమార్, ఎంపిపి కుండ అన్నపూర్ణ, జెడ్‌పిటిసి సభ్యుడు బోనం సాయిబాబా, ఎంపిడిఒ నాతి బుజ్జి, మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ కనుమూరి శ్రీనివాసరాజు, నాయకులు కొల్లి సామ్సన్, గారపాటి గంగారాం చౌదరి, సర్పంచులు వేముల శ్రీనివాస్, కొడమంచిలి లక్ష్మి, మెర్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

అంకితభావంతో పనిచేసేవారికే గుర్తింపు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

విధినిర్వహణలో అంకిత భావంతో పనిచేసేవారు గుర్తింపు పొందు తారని ఎదుర్లంక గ్రామ సర్పంచ్ ముదునూరి పద్మ కృష్ణార్జునరాజు అన్నారు. ఎదుర్లంక గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎంపిపి పాఠశాల్లో సెకండ్ గ్రేడ్ టీచర్ గా పనిచేస్తున్న నిడసమెట్ల కస్తూరి వెంకట సీతామహాలక్ష్మి గురువారం స్వచ్ఛంద ఉద్యోగ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సీతా మహాలక్ష్మి, తిమ్మాజీరావు దంపతులను సర్పంచ్ పూలమాలతో సత్కరించారు. పాఠశాల హెచ్ఎం.కృష్ణార్జున కార్యక్రమానికి అధ్యక్షత వహించారు కార్యక్రమంలో పితాని నాగార్జున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీతామహాలక్ష్మి దంపతులను సత్కరించిన దృశ్యం

బాలబాలాజీ హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి బాలాబాలాజీ హుండీల ఆదాయం 63రోజులకు రూ.32,82,125 వచ్చిందని సహాయ కమిషనర్ గ్రంధిమాధవి తెలిపారు. గురువారం జిల్లా సహాయకమిషనర్ కెఎన్‌విడివి.ప్రసాద్, అమలాపురం తనిఖీ దారు జె.రామలింగేశ్వరరావుల పర్యవేక్షణలో హుండీలు లెక్కించారు. బాలబాలాజీ హుండీల ఆదాయం 63రోజులకు రూ.31,81,919, అన్నదానం హుండీ ద్వారా రూ.1,00,206 కలిపి మొత్తం ఆదాయం 32,82,125, బంగారం 16. 300 గ్రాము లు, వెండి 205 గ్రాములు వచ్చినదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలోఆలయ ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్ గెడ్డం మంగాలక్ష్మి, పిఎసిఎస్ ఛైర్మన్ గెడ్డం కృష్ణ మూర్తి ,ధర్మ కర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీను, కొమ్ముల సూరి బాబు, బత్తుల విజయ గంగా రత్నం, సేవా సంఘ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

పంట నష్టం నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ పంటలు దెబ్బతినకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులను అప్రమత్తం చేయాలని జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో గురువారం జడ్‌పి ఏడు స్థాయి సంఘాల సమావేశాలు ఆయా సంఘాల చైర్‌పర్సన్ల అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాలలో సభ్యులైన జడ్‌పిటిసి సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, జిల్లా అధికారులు, అయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశాలలో పలు అంశాలను చర్చించి ఆమోదించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల వివిధ అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించి ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, జగనన్న స్వచ్ఛ సంకల్పం, జాతీయ ఉపాధి హామీ పథకం, హౌసింగ్, విద్యుత్, గ్రామీణ అభివృద్ధి తదితర అంశాలలో ఇప్పటివరకు జరిగిన పురోగతి, కొత్తగా ప్రతిపాదించిన పనుల వివరాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జడ్‌పి ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా పంటలు దెబ్బ తినకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అప్రమత్తతతో వ్యవహరించి గ్రామ స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు పటిష్ఠంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులు, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్యా, సంక్షేమం తదితర అంశాలపై చర్చించి, సభ్యులు తీర్మానాలు చేశారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యహరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలుచేయనున్నట్లు వేణుగోపాలరావు తెలిపారు. ఈ సమావేశంలో జడ్‌పి సిఇఒ ఎ.రమణారెడ్డి, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జెడ్‌పిస్థాయిసంఘాలసమావేశంలోమాట్లాడుతున్నచైర్మన్‌విప్పర్తి వేణుగోపాలరావు

యానాం వార్తలు


సత్యానందం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మద్దింశెట్టి సత్యానందంకి నివాళి

ప్రజాశక్తి - యానాం

మేయర్‌గా సేవలందించిన మద్దింశెట్టి సత్యానందం వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వ ర్యంలో గురువారం నిర్వ హించారు. ఈ సంద ర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రగాశం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మద్దింశెట్టి జియ్యన్న, కొల్లు ప్రసాద్, ముత్యాల బోస్, రాజు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మండపేటలో వైసిపి జెండాను ఆవిష్కరిస్తున్న రాణి తదితరులు

ప్రజాశక్తి-అమలాపురం (అల్లవరం)

సిఎం జగన్ పాలనలో అర్హులందరికే సంక్షేమ పథకాలు చేరుతున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. కొమరగిరిపట్నం గ్రామపంచాయితీలోని సచివాలయంలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిపి ఇళ్ల శేషగిరిరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు కొనుకు గౌతమి హాజరయ్యారు. సిఎం జగన్ అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు కొమరగిరిపట్నం సచివాలయానికి సంబంధించి అర్హులు అందరికీ వివిధ రకాల సంక్షేమ పథకాల రూపంలో రూ.22,33,04,118లు లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తిక్కా ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎన్ వి.సత్యనారాయణ, గ్రామ కమిటీ నాయకులు, గ్రామవార్డు సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, పంచాయితీ సిబ్బంది గ్రామ ప్రజలు హాజరయ్యారు. **మండపేట** అర్హులందరికీ వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని మున్సిపల్ ఛైర్పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. గురువారం స్థానిక 10వ సచివాలయం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఛైర్‌పర్సన్ దుర్గారాణి, కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజాబాబు మాట్లాడారు. అనంతరం 10వ సచివాలయంలో 21,22 వార్డుల ప్రజలకు నాలుగున్నర సంవత్సరాల్లో వివిధ పథకాలతో రూ.24.50కోట్లతో చేకూరిన లబ్ధిని చూపే డిస్‌ప్లే బోర్డు, 22వ వార్డులో వైసిపి పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్యబాబు, కౌన్సిలర్ బొక్కా సరస్వతి, వార్డ్ ఇంఛార్జి కంది నాగ శ్రీదేవి, జెసిఎస్.కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, మున్సిపల్ మేనేజర్ టి.కనకరాజు, సచివాలయ సెక్రెటరీలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** సిఎం జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని జగనే మళ్లీ సిఎం కావాలని జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. నంగ వరం-సన్నవిల్లి సచివాలయం లో గురువారం వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించి సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. ఎంపిటిసి సభ్యులు వంగా గిరిజకుమారి, కొంకి ఏడుకొండలు, వ్యవసాయ సలహా మండలి మండల ఛైర్మన్ మానే శ్రీను, సచివాలయాల మండల కన్వీనర్ కోటుం లోవరాజు, వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు ఓగూరి విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు, ఎంపిడిఒ కె.వెంకటేశ్వర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వీధి సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారధులు తదితరులు పాల్గొన్నారు.



అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్నసర్పంచ్ విజయలక్ష్మి

భారంగా పంచాయతీల నిర్వహణ

ప్రజాశక్తి-మామిడికుదరురు(పి.గన్నవరం)

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దష్టి నిలపక పోవడంతో లక్షలాది మంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పనుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోగా కేంద్రం మంజూరు చేసిన నిధులను సైతం దారి మళ్ళించడంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచ్ లు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండగా కొందరు సర్పంచులు అప్పులు తెచ్చి పాలకవర్గాలు ఆమోదించిన పనులు చేయడంతో పాటు సొంత నిధులు ఖర్చు చేసి గత రెండేళ్లలో అభివద్ధిపై దష్టి సారించి ప్రజలకు జవాబు దారీగా నిలిచారు. అప్పులు చేసి సొమ్ములు, సొంత ఖర్చుతో చేసిన సొమ్ములు, రాక సతమత మవుతున్నారు. ఈనేపథ్యంలో సచివాలయాల నిర్వహణ పంచాయతీల మీద పడటంతో వీటి నిర్వహణ మరింత భారంగా మారింది.

పాంచాల రేవుల బిల్లులు రాలేదు

గత రెండున్నర ఏళ్ల నుంచి పి.గన్నవరం పరిధిలో ప్రజల అవసరార్థం గుర్తించి 30 పాంచాలు నిర్మించాం. రూ.18 లక్షలు బిల్లులు రావాల్సి ఉంది. చేపల షెడ్డు నిర్మాణములకు రూ.4 లక్షలు వెచ్చించాం. శివాలయం రోడ్డు రూ.16 లక్షలతో ఆధునికీకరించగా రూ.4 లక్షలు వచ్చాయి. రూ.12 లక్షల రావాల్సి ఉంది. ముందస్తు పెట్టుబడులు పెట్టి అభివద్ధి పనులు చేపట్టిన పంచాయతీకి రావాల్సిన నిధులు రాక అవస్థలు పడుతున్నాం. అభివృద్ధి చేయకపోతే ప్రజలకు జవాబుదారీ ఎలా అని వాపోతున్నారు. ఇదే విధంగా మిగతా మేజర్ పంచాయతీ పరిస్థి తులు అగమ్య గోచరంగా మార డంతో పం చాయ తీలకు ఇవ్వాల్సిన వాటి నిధులు రాష్ట్ర ప్రభు త్వం ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులు రూ.8629 కోట్లు దారి మళ్లించడంతో సర్పంచుల సమస్యలపై డిసెంబర్ 1 నుంచి రెండో దశ ఉద్యమం చేపట్టడానికి సర్పంచులు సమయత్వం అవుతున్నట్లు పి.గన్నవరం సర్పంచ్ తెలిపారు.


నాగమణి, సర్పంచ్, పి.గన్నవరం


సిసిరోడ్డు అభివద్ధి పనులకుశంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నాగమణి(ఫైల్ ఫొటో)

పి.గన్నవరం పంచాయతీదీ ఇదే దుస్థితి

కరోనా సమయం నుంచి నేటి వరకు బ్లీచింగ్, శానిటేషన్ పనులకు ఖర్చు చేసిన బిల్లులు నేటి వరకు రాలేదని పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణి అన్నారు. ఫలితంగా స్లీపర్లకు నాలుగు, ఐదు, నెలల జీతాలు ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నా యన్నారు. 2022-23 లో డ్రైన్ల పూడిక పనులు చేపట్టినా నేటికీ బిల్లులు రాలేదు. పంచాయతీ పరిధిలో వీధిలైట్లు నిర్వహణకు రూ.మూడు నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతున్నాయి. నిధులు లేమితో వీట నిర్వహణ మరింత భారంగా మారింది.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి పోసుబాబు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ సన్నవిల్లి,నంగవరం పంచాయితీ కార్యాలయాల వద్ద గురువారం సర్పంచ్ లు చిక్కం పెదబాబు,జిన్నూరి వెంకటేశ్వరరావు ల అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ హెల్త్ కార్డులను ఎంపిడిఒ,కెవి ప్రసాద్ అందజేశారు.ఈ సందర్భంగా పి హెచ్ సి వైద్యాధికారి ఎల్.నాగార్జున ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి వి. పోసుబాబు మాట్లాడుతూ . పిఎం కిసాన్ నమోదు చేసుకోని రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి వంగా గిరిజకుమారి, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంఎ షంషీ,ఇ ఒ పి ఆర్ డి,కెఎస్ గౌరీ కుమారి, పంచాయతీ కార్యదర్శి వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాచరలో విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న హెచ్ఎం రమాదేవి

ఇంటర్ విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని మాచర జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్లస్‌లోని ఇంటర్ విద్యార్థినులకు గురువారం దాతలు అందించిన స్టడీ మెటీరియల్స్ ను,పాఠశాల హెచ్ రమాదేవి అందజేశారు. మాచర వెల్ఫేర్ అసోసియేషన్ అలూమిని తరపున రూ.5 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్ మెటీరియల్ ను తన తల్లి పర్వత వర్ధనమ్మ పేరట విద్యార్థునులకు వితరణగా అందజేసినట్లు హెచ్ఎం తెలిపారు . ఈ సందర్భంగా దాత ప్రొఫెసర్ గొడవర్తి భగవానును, పాఠశాల హెచ్ఎం రమాదేవి అభినందించారు. ఈ స్టడీ మెటీరియల్స్ ను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పిజిటిలు నూక పెయ్యి వెంకట్రావు, వాడ్రేవు శ్రీనివాస్, పూజ్యం శిరిడి సాయి, శ్రీనివాస్ ,ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం కోర్టులో కాపు ఉద్యమ నేతలు

ప్రజాశక్తి-అమలాపురం

కాపు ఉద్యమంలో భాగంగా అమలాపురం పోలీస్ స్టేషన్ ముట్టడి సందర్భంగా నమోదైన కేసులో గురువారం అమలాపురం జిల్లా కోర్టుకు కాపు ఉద్యమ నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాపు ఉద్యమ నాయకులు ముద్రగడ పద్మనాభం, కల్వకొలను తాతాజీ, ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణుమూర్తి, తదితరులు కోర్టు కు హాజరయ్యారు.


కోర్టులో కాపు ఉద్యమ నాయకులు

డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-కొత్తపేట

కమ్మిరెడ్డి పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద డ్రైనేజీ సమస్యతో అక్కడ స్థానికులు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ నిండిపోయి రోడ్డు మీద నీరు నిలువ ఉండిపోయింది. అక్కడ ఉన్నటువంటి స్థానికుల ఇబ్బందులను గ్రహించిన పంచాయతీ ఉపసర్పంచ్ కంఠంశెట్టి శ్రీనివాసరావు తమ సొంత ఖర్చులతో సెప్టిక్ ట్యాంక్ లారీని తీసుకుని వచ్చి నిలవ నీటిని తోడించారు. ట్యాంకులతో నీరు తొలగించి స్థానికులకు తాత్కాలికంగా డ్రైనేజ్ సమస్య పరిష్కరించారు. త్వరలోనే శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని స్థానికులకు తెలియజేశారు. కార్యక్రమంలో గుబ్బల మూర్తి,మండేపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

22వ వార్డులో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలో 22వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ" కార్యక్రమం మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లలో అన్ని వర్గాల వారిని మోసం చేసిందన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు మరమ్మత్తులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. మరమ్మతులు కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని ఉప్పలగుప్తం, గొల్లవిల్లి,భీమనపల్లి,నంగవరం, సూదా పాలెం, విలసవిల్లి, భట్టుపాలెం, సింగరాయపాలెం,మునిపల్లి, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, సన్నవిల్లి, వానపల్లిపాలెం, ఎన్.కొత్తపల్లి, రాఘవులపేట, చీకట్లపాలెం,పేరాయిచెరువు, వాడపర్రు, కూనవరం, కిత్తనచెరువు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

ఒక నెలలో రూ.1.40 లక్షల జరిమానా

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక నెల లో రూ.1.40 లక్షల జరిమానా విధించినట్లు ఎస్ఐ నాగార్జున రాజు తెలిపారు. నవంబర్ నెలకు సంబంధించి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో మద్యం సేవించి వాహనం నడిపిన 15 మందిను పెద్దాపురం కోర్టు లో హాజరు పర్చగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు. ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలోని కత్తిపూడి జాతీయ రహదారిపై గురువారం ప్రయాణీకులతో వెళ్తున్న ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో 5గురు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కత్తిపూడి నుంచి ఎవి నగరం వెళ్ళుచున్న ప్రయాణీకుల ఆటో స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో విశాఖపట్నం వెళు తున్న లారీ ఆటోను తప్పించే క్రమంలో ఢీకొట్టింది. ఈ ఆటోలో ప్రయాణిస్తున్న గంపల చంద్రరావు (65) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన క్షతగాత్రులు ఆరుగురిని అంబులెన్స్ వాహనంలో తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా, ఆసుపత్రి వద్ద పరిస్థితి విషమించడంతో దోని కాశమ్మ (65) మృతి చెందింది. ఎస్ఐ ఆర్‌విఎన్.మూర్తి ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

186 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండలంలోని పల్లంకుర్రు పంచాయతీ శివారు మొల్లేటి మొగ కొత్తపాలెంలో గురువారం ముమ్మిడివరం ఎస్ఇబి ఎస్ఐ సిహెచ్.రాజేష్, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 186 ఎన్‌డిపిఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సంగాని సూరిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు. అక్రమ మద్యం కలిగి ఉన్నా, అమ్మినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

పలు రెస్టారెంట్లపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

రెస్టారెంట్లలో వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని రీజనల్ విజిలెన్స్ ఇన్‌ఛార్జి ఎస్‌పి ఎ.సురేష్‌బాబు హెచ్చరించారు. గురువారం రాజమహేంద్రవరంలో పలు రెస్టారెంట్లపై విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. జెఎన్ రోడ్డులోని ఐరన్ హిల్ బార్ అండ్ రెస్టారెంట్‌లో సిగరెట్లు అధిక ధరలకు అమ్మినందుకు, ప్రామాణికం కానీ మెజర్స్ జార్‌లు కలిగి ఉన్నందుకు కేసులు నమోదు చేశామని అన్నారు. టి.నగర్ లోని కుమారి థియేటర్ సమీపంలోని నెల్లూరు మెస్‌లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను గుర్తించామని, హోటల్‌ను లైసెన్స్ లేకుండా నడుపుతున్నందున నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఎవి.అప్పారావు రోడ్డులోని శ్రీకృష్ణ కల్యాణి ది వెన్యూ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు. రెస్టారెంట్లు, బార్ల పరిసరాలు, కిచెన్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి ముత్యాలనాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, నాగ వెంకటరాజు, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, ఎస్ఐ జగన్నాథరెడ్డి, హెచ్‌సి జీవానందం, కానిస్టేబుల్స్ వలీ, లోవకుమార్, కిషోర్, వీరబాబు పాల్గొన్నారు.

సామర్లకోటలో బార్ సీజ్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న అశ్విని బార్ను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసి తాళం వేశారు. బార్ నిర్వాహకులు నౌకర్ మామ అనుమతి తీసుకోకుండా బార్ నిర్వహిస్తున్నారని వచ్చిన ఫిర్యాదులతో అక్టోబర్ 22న శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్ నిర్వహించిన దాడులు చేశారు. ఈ నేపథ్యంలో అనుమతి లేకుండా బార్ నిర్వహిస్తుండటంతో రూ.11 లక్షలు జరిమాన చెల్లించాలని ఇటీవల సామర్లకోట ఐఎంఎల్ డిపో మేనేజర్ ఎస్‌కెడివి.ప్రసాద్ రావు బార్ నిర్వాహకులకు నోటీస్ ఇచ్చారు. ఆ నోటీసును పట్టించుకోకపోవడంతో బుధవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు బార్‌కు తాళాలు వేసి సీజ్ చేశారు. గురువారం సాయంత్రం ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

ఉప్పాడలో అలల ఉధృతి బోటు బోల్తా, నలుగురికిగాయాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఉప్పాడ సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉధృతంగా ఉండడంతో రామన్నపాలెం తీరం వద్ద నిర్మిస్తున్న హార్బర్ వద్ద రాకాతి గంగరాజు అనే మత్స్యకారుని బోటు హార్బర్ రాళ్లకు ఢీకొని ధ్వంసమైంది. నలుగురు గాయపడ్డారు. గురువారం ఉదయం వేటకు వెళ్లిన మత్స్యకారులు అమీనాబాద్ రేవుకు వస్తుండగా అలలు ఉధృతంగా ఉండడంతో ఆర్బర్‌కు వేసిన రాళ్లను ఢీకొట్టడంతో బోటు ధ్వంసమైంది. బోటులో ఉన్న మత్స్య సంపద సముద్రంలో కలిసిపోయింది. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల వరకూ నష్టం జరిగిందని, బోటులో నలుగురు మత్స్యకారులు గాయపడినట్లు స్థానికులు తెలిపారు. హార్బర్ నిర్మాణం కోసం చేపడుతున్న పనుల వల్లే నిత్యం బోట్లు ప్రమాదాలకు గురవుతున్నాయని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామ శివారున బుధవారం అర్ధరాత్రి లారీ డ్రైవర్ గుండె పోటుతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్‌టిఆర్ జిల్లా కోడూరు మండలం, కుంటముక్కల గ్రామానికి చెందిన సాహూ గోపి(55) విజయనగరం టైల్స్ లోడ్‌తో వెళ్తుండగా జెడ్ రాగంపేట శివారుకు వచ్చేసరికి, గుండెనొప్పి వస్తుంది అని లారీ పక్కకు తీసి కూలిపోయాడు. వెంటనే క్లీనర్ మరొక డ్రైవర్ దగ్గర్లో ఉన్న ఆదిత్య ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. దీంతో మృతదేహాన్ని లారీలోనే ఉంచి బంధువులకు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించినట్లు రోడ్డు సేఫ్టీ డ్రైవర్ సతీష్ తెలిపారు.

తాడిపర్రులో 200 మందిపై కేసులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో 144 సెక్షన్‌ను ఉల్లంఘించి, రోడ్డును దిగ్బంధించిన రెండు సామాజిక తరగతులకు చెందిన 200 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ కె.రామారావు తెలిపారు. ఒక గ్రూపునకు చెందిన 100 మంది మహిళలు, పురుషులపై మరో గ్రూపునకు చెందిన 100 మంది మహిళలు, పురుషులపై పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. ఇటీవల తాడిపర్రులో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఒక విగ్రహం విషయమై చట్ట ప్రకారమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ, రెండు గ్రుపులకు చెందిన వారు నిబంధలను ఉల్లంఘించి, రోడ్లను దిగ్బంధించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించారని తెలిపారు. ఎవరైనా చట్టానికి లోబడి ఉండాలని, చట్టాన్ని అతిక్రమిస్తే తగిన శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నలుగురు లేదా అంతకన్నా ఎక్కువమంది గుమిగూడినా, రోడ్లపైకి చేరినా, కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కొవ్వూరు ఆర్‌డిఒ కోర్టులోని 107 సెక్షన్‌నుఉల్లంఘించినందుకు కూడా తగిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే పోలీసులకు తెలియజేయాలని, ఎవరూ చట్టాన్ని చేతిలోకి తీసుకోరాదని ఆయన సూచించారు.